



6

# క్షుద్రక్రీడ

పగుడు బాలిసి జాంబ్రి

రన్... రన్... రన్...

వగరుస్తూ పరిగెడుతున్నాను. ఎసైన్‌మెంట్ మిస్సయితే తిట్లూ శాపనార్థాలు తప్పవు. మిస్సవకపోయినా తప్పవు. ఏదో ఒకందుకు తిట్లు తప్పవు.

రన్... రన్... రన్....

ఈ రోజుకిది నాలుగో ఎసైన్‌మెంట్. తిండీ తిప్పలు లేకుండా పగలూ రాత్రి ఎండల్లో వానల్లో వార్తల కోసం దేబిరించాలి. ''మ్యూజికల్ ఛైర్స్ కవర్ చేయాలి. కల్చరల్ రమణ ఈరోజు రావడం లేదట. ఎడిటర్ మస్ట్. సిటీ ఎడిషన్‌కిస్తే చాలు'' బ్యూరో చీఫ్ ఆర్డరు.

ఎడిటర్ మస్ట్ అంటే వున్నది లేనట్టూ, లేనిది వున్నట్టూ రాయాలి. గెలిచిన వాడి కళ్లు చారడేసి అని రాయాలి.

రన్... రన్... రన్...

ఉదయం నుంచి చాయ్ కూడా తాగలేదు. ఎంబసీలో చాయ్, నాలుగు ఉస్మానియా బిస్కట్లు చప్ప రిస్తే బాగుణ్ను. ఒకటే దాహం, ఆకలి. రోజుకిన్ని ఎసైన్ మెంట్లు వేస్తే ఎలా చస్తామనుకుంటారో! స్పోర్ట్స్ రిపో ర్టర్‌ని పంపించొచ్చు కదా!

రన్... రన్... రన్...

అదేమిటీ, కూలిపోయి వుందేమిటి!

ఫ్లై ఓవర్ కడ్తారంట సార్. షాపు కూలగొట్టిండ్రు!

రన్... రన్... రన్...

అధ్యక్షోపన్యాసం మిస్సయితే తిట్లు తప్పవు.

క్విక్ పరిగెత్తు, త్వరగా రన్!!!

ఆల్ ఇండియా మ్యూజికల్ ఛైర్స్ కాంపిటీషన్. 'వెలకం టు పార్టీసిపెంట్స్ అండ్ వ్యూయర్స్,' నియాన్ బిల్ బోర్డు స్టేడియం గేటు దగ్గర మెరుస్తోంది.

'మోర్గాన్ అండ్ మోర్గాన్ ఈజ్ ప్రౌడ్ టు బి అసోసియేటెడ్ విత్ ద గాలా ఫంక్షన్,' మరో బిల్‌బోర్డు.

అప్పటికే స్టేడియం అంతా నిండిపోయింది. ఫ్లడ్ లైట్ల వెలుతుర్లో జనాలు పూనకం వచ్చినవారిలా వూగు తున్నారు.

ఆట మొదలైపోయినట్టుంది.

రన్... రన్... రన్... అంటూ ముక్తకంఠంతో అరు స్తున్నారు. ముందుకు వెళ్లేందుకు కాస్త చోటు దొరికితే బావుణ్ను.

''నన్ను ముందుకు వెళ్లనీయండిరా బాబూ! మిస్స యితే రేప్పొద్దున్న మీకు న్యూసుండదురా బాబూ! కాస్త తోవివ్వండి ప్లీజ్. ఉద్యోగం పోతుందిరా బాబూ! నాలుగు ముక్కలు విననియ్యండి అమ్మల్లారా,'' నా మాటలు ఎవరూ పట్టించుకోవడం లేదు.

'జర హటో బాయ్' అని అనబోతుండగానే వెనుక నుంచి ఎవరో తోశారు. ''అంత ముఖ్యమైతే కాస్త ముందు ఏడవచ్చు కదా!''

వచ్చి వుండేవాణ్నిరా బాబూ, మధ్యాహ్నం పూట తిని కాసేపు పడుకునే వీలుంటే ముందుగానే వచ్చుండే వాడినేరా బాబూ!

ఎవరిమీదో పడ్డాను.

''ఎందుకురా బయ్ గట్ల నూకుతవ్,''' ఎవరో మళ్లీ తోశారు. తూలి పడబోయేంతలో ఎవరో భుజం పట్టుకున్నారు. రన్... రన్... రన్... జనాలు అరుస్తూనే వున్నారు.

"సిగ్గులేదు ఎదవలకి," గొణిగాడు నన్ను పట్టుకుని ఆపిన అబ్బాయి. కళ్లు ఎర్రగా వున్నాయి. కోపంగా వున్నాడు.

రన్... రన్...

అతనొక్కడే అరవడం లేదు. ''దొంగలు, దొంగలు,'' అని నసుగుతున్నాడు. అప్పుడు చూశాను. అతను ఎవరిని తిడుతున్నాడో అని. స్టేడియం మధ్యలో స్టేజి వుంది. బంగారు పళ్లెంలా మెరుస్తూంది. విశాలంగా వుంది. ఫేషన్ షోలప్పటి స్టేజీలాగుంది. మధ్యలో ఒక కుర్చీ. ఒక్కటే కుర్చీ, దానిచుట్టూ ఆరుగురు పరిగెడుతున్నారు.

రన్... రన్... రన్...

స్టేజీకి ఒక మూల మోర్గాన్ అండ్ మోర్గాన్ బేవరేజెస్ స్టాల్ వుంది.

ఆ ప్రక్కనే గ్లాస్ ఎంక్లోజర్‌లో టేబుల్, దానిమీద వడ్డించిన బోయినం ప్లేటు. కుర్చీ గెలిచిన వారికి దక్కే బోయినం!

రన్... రన్... రన్...

కుర్చీ చుట్టూ పరిగెడుతున్నారు ఆరుగురు.

అది దక్కేది ఒక్కరికే, ఒక్కరే కూర్చుంటారందులో.

బోయినం ఒక్కరికే.

రన్... రన్... జనం అరుపులతో స్టేడియం హోరెత్తుతోంది.

"ఇప్పుడు కాసేపు వాణిజ్య ప్రకటనలు. ద షో విల్ కంటిన్యూ ఆఫ్టర్ ద బ్రేక్," యాంకర్ అంది తల ఎగరేసి జుత్తు సవరించుకుంటూ..!

"మోర్గాన్ సాఫ్ట్ డ్రింక్స్ తాగి కాసేపు సేదతీరండి," మళ్లీ తనే. ఆట హడావుడిలో దాహాన్ని మర్చిపోయాను. నాకో లెమన్ ఫ్లేవర్డ్ డ్రింక్! చల్లగా, పుల్లగా డ్రింక్ కడుపులో దిగేసరికి ప్రాణం లేచి వచ్చింది. 'బానిసకొక బానిస,' అని నా ప్రక్కబ్బాయి గొణుగుతున్నాడు. ఎవరిని అంటున్నాడు? నన్నా, జనాలనా, కుర్చీ చుట్టూ తిరిగేవారినా? డ్రింక్స్ అమ్మకాలయ్యాక స్టేడియంలో కరెంట్‌పోయింది.

"సారీ ఫర్ ది ఇన్‌కన్వీనియన్స్. మోర్గాన్ వారి యూ.పి.ఎస్. సిస్టమ్స్ వాడండి, చీకట్లను తరిమికొట్టండి," యాంకర్ అంది తియ్యగా. యాంకర్ చేతిలోని మైక్ ఇంకా పూర్తిగా ఆరని ఫ్లడ్ లైట్ల వెలుగులో చిత్రంగా మెరుస్తోంది. యాంకర్ ప్రకటన ముగిసిన వెంటనే మళ్లీ లైట్లు వెలిగాయి.

ఇన్నాళ్లూ కుర్చీ మీద కూచున్నవాడివల్లే ఈ చీకట్లు. బోయినం టేబుల్ నాకివ్వండి. మీకు దీపపు బుడ్డిస్తాను. మీ జీవితాల్లో వెలుగులు నింపుతాను. ఆరుగుర్లో ఒకడు అరిచాడు. 'గెద్దలు కూడా వీడి శవం ముట్టవు. మొన్నటిదాకా వీడు వాడి చంకే నాకేవాడు. బోయినంలో వాటా దొరకలేదని ఇప్పుడిలా వాగుతున్నాడు," ఎర్ర కళ్లబ్బాయి కాస్త గట్టిగానే అన్నాడు. నాలుగడుగుల ముందున్న డిప్ప కటింగ్ చెవిడొప్ప మావైపు తిరిగింది.

రన్... రన్... రన్...

కుర్చీ చుట్టూ మళ్లీ పరుగు మొదలైంది. అన్ని వేల నోళ్లు ఒక్కసారి అరవడంతో ఆ రాత్రి ఎవ్వరో బ్రహ్మ రాక్షసుడు కేక పెడుతున్నట్లుగా వుంది. దెయ్యాల జావళికి తీతువులు కోరస్ అందిస్తున్నట్లుగా వుంది. నన్నెందుకో భయం చుట్టుకుంది. అప్పుడు చూశాను మొదటిసారి జనాల ముఖాల్లోకి. చాలామంది ఎందుకో భయపడుతున్నట్లుగా వుంది. కొంతమంది నిస్త్రాణగా వున్నారు. ఎవ్వరినో చూసి బెదిరిపోతున్నట్లుగా వున్నారు. కడుపులో తిప్పుతున్నట్లుంది. మోర్గాన్ లెమన్ ఫ్లేవర్డ్ డ్రింక్ ఇమడటం లేదు. ఆట త్వరగా పూర్తయితే బావుణ్ను. సిటీ డెడ్‌లైన్ దగ్గర పడుతుంది.

రన్... రన్... రన్...

''సిగ్గులేదు, ఎదవనాయాళ్లకి, ఎన్నిసార్లు గమకీలు తిన్నా బుద్ధిరాదు గాడిదలకి,'' ఎర్ర కళ్లబ్బాయి ఇంకాస్త గట్టిగా అన్నాడు. కొంతమంది ఇటు చూడటం మొదలుపెట్టారు. తాము ఈ డిసెంటర్ వంక చూస్తున్నట్లుగా ఎవరికీ తెలియకూడదన్నట్లుగా చూస్తున్నారు.

దాడి చేసే ముందు శబ్దం చేయకుండా అడుగులు వేసే నక్కలాగా, డిప్ప కటింగ్ వస్తున్నాడు. వస్తూ జనంలో అక్కడా అక్కడా వున్న నక్కలు మరి రెండిటికి సిగ్నల్ ఇచ్చాడు. 'వేట' దొరికినప్పుడు నక్కలు ఇచ్చుకునే సిగ్నల్ అది. 'వాచ్‌డాగ్'ని కదా నక్కల కదలికలని ఆ మాత్రం కనిపెట్టగలను. "ఎందుకురా బాబు అట్లా అరుస్తావు? ఖరుసైపోతావు. ఏమైనా కడుపుమంట వుంటే నా రూమ్‌కి రారా బాబూ! మాట సాయం చేస్తాను. ఊరుకోరా నాయనా," అని ఎర్రకళ్లబ్బాయితో చెబ్దామనిపించింది. అప్పటికే డిప్ప కటింగ్‌లు అతడిని కమ్మేశాయి.

రన్... రన్... రన్... జనాలు అరుస్తూనే వున్నారు.

"కుర్చీ నాకిస్తే నేను బోయినం చేయగా మిగిలింది మీకిస్తాను."

"కుర్చీ మాకిస్తే సిసింద్రీలు కట్టిస్తాం."

"ఇదివరకు మేం కుర్చీలో వున్నప్పుడు బోయినం సరిగా తిననేలేదు. అందుచేత ఈసారి కూడా కుర్చీ మాకిస్తే పూర్తిగా తిని బ్రేవ్ మనిపిస్తాం!"

"పాటలు కాదురా నాయనలారా! సిసింద్రీలు కాదురా వెధవల్లారా! ఉల్లిబద్ద కావాల్రా నాయనా!" ఎర్ర కళ్లబ్బాయి అరుస్తున్నాడు.

నా చుట్టూ కలకలం మొదలైంది. నా భయం మరింతగా పెరిగింది.

'ఐ షల్ జస్ట్ బి ఎన్ ఆన్‌లుకర్ ఐ కాంట్ బి ఇన్ ద ఐ ఆఫ్ స్టార్మ్. రిపోర్టర్ ఈజ్ ఎ పాసివ్ ఆన్‌లుకర్ టు ద హేపనింగ్స్.' తప్పుకో ప్రక్కకి తప్పుకో.

"పాటలు కాదురా గొర్రెల్లారా, భోజనం ముఖ్యంరా గాడిదల్లారా. ఆ భోజనం టేబుల్ కోసం కొట్లాడండిరా వెధవల్లారా," ఆ అబ్బాయి.

"ఎవడ్రా అది! పాట ముఖ్యమా, వెధవ భోజనం ముఖ్యమా!"

"సిసింద్రీ ముఖ్యమా! తుచ్ఛమైన భోజనం ముఖ్యమా!"

కొట్టండ్రా వాడ్ని.

రన్... రన్... రన్... ఆట నడుస్తూనే వుంది.

"బాబ్బాబు వేళ్లు నొప్పెడుతున్నాయి. ఇన్నాళ్లు నుంచునే వున్నాను. ఒక్కసారి కూడా బోయినం చేయలేదు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి. ప్లీజ్. సీటు దగ్గరకు నేను వచ్చేప్పటికి స్టాప్ చెప్పండి ప్లీజ్," కుర్చీ చుట్టూ పరిగెత్తే వారిలో ఒకాయన అరుస్తున్నాడు.

"మీరు ఎవడ్ని ఎక్కించినా ఆడ్ని తోసేసి నే ఎక్కేస్తా. లేదా ఆడి కాలుపట్టి లాగేస్తా. అదీ కుదరకపోతే వాడి పంచనే చేరతా. ఎందుకురా నాయనా అలాటి చెడ్డ పనులు నాచేత చేయిస్తారు. నాకు కుర్చీలు యివ్వండిరా బాబూ," ఇంకొకడు రొప్పుతూ జనాల్ని బతిమాలుతున్నాడు.

రన్... రన్...

తెగిన పేగు కోసం ఏడుస్తున్న తల్లిలా అరుస్తున్నారు జనం.

రన్... రన్...

"అరుపులు ఆపండిరా గొర్రెల్లారా. ఆట ఆపండిరా బాబూ పాట ఆపండిరా. రన్... రన్ అని వాళ్ల కాళ్లకు బుద్ధి చెప్పేలా ఆ గాడిదలకు బడితపూజ చెయ్యండిరా నాయనలారా! అమ్మల్లారా ఉల్లిపాయలను బొక్కినవాళ్లను రాళ్లతో కొట్టండమ్మా! మీ ఇళ్లను కూల్చిన వాళ్లని, విత్తనాలను అమ్మేవాళ్లని, వాళ్లని చేరదీసే వాళ్లని చంపండిరా బాబూ!" ఎర్ర కళ్లబ్బాయి కోపంతో వూగిపోతూ అరుస్తున్నాడు. క్రోధంతో పిట్లుతున్నాడు.

అతను ఏదో నిజం చెబుతున్నాడని కొందరికి అనిపించింది. బయటికి చెప్పుకోలేని తమ అందరి ఆక్రోశాన్ని అతడు వెళ్లగక్కుతున్నందుకు మరికొందరికి హాయిగా అనిపించింది. మరికొన్ని విషయాలు అతనెందుకు మరిచిపోయాడని మరికొందరనుకున్నారు. కానీ అక్కడక్కడా నిలుచున్న డిప్ప కటింగ్ వాళ్లని చూసి అటే బాగుందని నిర్ణయించుకున్నారు.

ఈ లోపల, "ఆర్డర్! ఆర్డర్!" అని మధ్యలోంచి ఎవ్వడో లేచి అరిచాడు.

"లెట్ ద రూల్ ఆఫ్ ద గేమ్ బి ప్రివైల్డ్," అని కూడా అరిచాడు.

"ఎవ్వరి ఆటరా ఇది! ఈ ఆట రూల్స్ ఎవ్వరు గీశారు? ఎవ్వరి ఆట ఎవ్వరు ఆడుతున్నారు? వియార్ ప్లేయింగ్ దైర్ గేమ్."

ఎర్ర కళ్లబ్బాయి యింకా పూర్తి చెయ్యలేదు. అప్పటికే ఆ అబ్బాయిని కమ్మేసిన డిప్ప కటింగ్‌లు ఆ అబ్బాయిని ఈడ్చుకుపోతున్నారు. నాతోపాటు చాలా మంది చూస్తూనే వున్నారు. చూడనట్టుగా వున్నారు. 'చూడనట్టుగా వుంటే మాకు నచ్చుతుందని తెలుసుకుని నడుచుకుంటున్నందుకు,' తృప్తిపడి డిప్ప కటింగ్‌లు మాయమయ్యాయి.

'ఎవ్వరైనా వాళ్లని ఆపితే బాగుణ్ను. ఎందుకు అతడ్ని తీసుకుపోతున్నారని ఎవ్వరైనా అడిగితే బాగుణ్ను,' అని ప్రతివాడూ అనుకుంటున్నాడు.

కానీ అందరూ అరుస్తూనే వున్నారు. రన్... రన్...

మందలోకి చొరబడి దూడ నెత్తుకుపోయిన నక్కలనెవరూ అడ్డుకోనందుకు అందరికీ కోపంగా వుంది. నోరువిప్పి యిదేమిటీ ఘోరం అని అడగకుండా అడ్డుకుంటున్న అదృశ్య బంధనాలను తిట్టుకుంటున్నారు.

రన్... రన్... రన్...

రన్... రన్... రన్...

కుపితులై, భయవిహ్వలురై అరుస్తూనే వున్నారు.

ఆట క్లైమాక్స్‌కి చేరుకుంది.

"స్టాప్," అందరూ ఒక్కసారే అరిచారు. యాంకర్ దగ్గర నుండి సంకేతం రాగానే ఎలాగోలా కుర్చీ ఎక్కి తీరుతాననే వాడికే దక్కింది కుర్చీ.

వాడిదే కుర్చీ.

బోయినం వాడిదే.

వాడు బోయినం మొదలెడుతుండగా ఫ్లడ్ లైట్ ఒకటి వాడిమీదే ఫోకస్ అయింది. మిగతా లైట్లన్నీ డిసాల్వ్ అయ్యాయి. మిగతా స్టేడియం అంతా చీకటి. కటిక చీకటి.

*

రన్... రన్...

సిటీ ఎడిషన్‌కి ఇంకా అరగంటే టైముంది.

డెడ్‌లైన్. మృత్యురేఖ.

రోజూ చావే.

ఎ టార్సో మీటింగ్ ద డెడ్‌లైన్ ఎవ్రీడే!

రన్... రన్...

"ఇప్పటిదాకా చేస్తే ఎలాగండి. పావుగంటే వుంది. త్వరగా యివ్వండి. క్విక్. సింగిల్ కాలం యివ్వండి," డెస్క్ ఇన్‌ఛార్జి.

హ్యూమన్ ఎగోనీ ఇన్ ఎ సింగిల్ కాలమ్!

క్రైమ్ నారాయణ ఫోన్లో వింటూ బరా బరా రాస్తున్నాడు. ఏం రాస్తాడు? ఈ రోజు నగరం ఇరుసులో ఎందరు నలిగి వుంటారని.

ఈ రోజెందరు గురూ?

"ఏక్సిడెంట్లు మూడు. వరకట్నం మూడు. ఆత్మహత్యలు రెండు. ఎన్‌కౌంటర్ ఒకటి."

సరే. సింగిల్‌కాలం వాడి మొహమ్మీద కొడితే ఈ పూటకి సరి.

రేపుదయం మళ్లీ మామూలే.

(ప్రత్యేక ప్రతినిధి)

*హైదరాబాద్, డిసెంబర్ 12: ఇక్కడి లాల్ బహదూర్ స్టేడియంలో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఆల్ ఇండియా మ్యూజికల్ ఛైర్స్ కాంపిటేషన్‌లో రమేష్‌కుమార్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుపొందారు. బోయినం తాను చెయ్యడమే కాకుండా, పాటలు కట్టేవారికి, సిసింద్రీలు చేసేవారికి కూడా బోయినం చెయ్యడంలో సహాయపడతానని ఆయన హామీ ఇచ్చారు. ఒకవేళ వారికి మిగలకపోతే బయటి నుండి అప్పుడు అడిగి అయినా బోయినం పెడతానని కూడా ఆయన మాట ఇచ్చారు. 'దేర్ ఆర్ నో ఫ్రీ మీల్స్' (కష్టపడితే బోయినం) అన్న ఇంగ్లీషువాడి మాటను పాటించి బాగా కష్టపడాలని ఆయన ప్రజలను కోరారు. ప్రజలు తమ పనులను తామే చేసుకుంటే బోయినం చెయ్యడానికి తనకు మరింత వెసులుబాటు వుంటుందని ఆయన అన్నారు.*

*

అమ్మయ్య! ఈ రోజుకి ఒక చావొదిలింది. రేపు ఉదయం మళ్లీ మామూలే. గానుగెద్దు జీవితం. ఏన్ అనెండింగ్ జర్నీ ఫ్రమ్ ఒన్ ఆర్డియల్ టు ఎనెదర్.

ఇదుగోరా బాబూ నీ సింగిల్ కాలమ్!

నారాయణా గుడ్‌నైట్! ఇంకా కాలేదా నీ శవ విచారణ?

"గురూ... గురూ ఈ ఒక్క ఐటమ్ చూసి పెట్టు గురూ," అంటూ వెళ్తున్న నన్ను ఆపాడు నారాయణ.

"అలిసిపోయా నారాయణా పంపించెద్దూ"

"ప్లీజ్ గురూ! ఒక్క లుక్కేద్దూ!"

"సర్లే యిటివ్వు."

క్రైం రిపోర్టర్

*హైదరాబాద్, డిసెంబరు 12: నగర శివార్లలో నేటి అర్ధరాత్రి జరిగిన ఎన్‌కౌంటర్లో ఒక గుర్తు తెలియని తీవ్రవాది మరణించాడని పోలీసువర్గాలు తెలిపాయి. మేడ్చల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక యువకుడ్ని ప్రశ్నిస్తుండగా అతడు తమపై కాల్పులు మొదలుపెట్టాడని, ఆత్మరక్షణ కోసం తాము జరిపిన కాల్పుల్లో ఆ యువకుడు అక్కడికక్కడే మరణించాడని పోలీసులు తెలిపారు.*

***ఆదివారం ఆంధ్రజ్యోతి, 18 ఏప్రిల్, 1999***

